

ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు

మూడు రోజుల పాటు సాగిన రాష్ట్ర స్థాయి అండర్ -14 సాఫ్ట్‌బాల్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. - 8లో



సాక్షి స్పెల్‌బీకి విశేష స్పందన

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పోటీలకు విశేష స్పందన లభించింది. - 8లో



హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

కోయంబత్తూరుకు చెంది ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరయ్యే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులను ఆయా యాజమాన్యాలు ఫీజుల పేరుతో ఇబ్బందులు పెట్టకూడదని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అర్హత ఉన్న విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసే వరకు ఎలాంటి ఒత్తిడి చేయకూడదన్నారు. ఫీజులు చెల్లించలేదనే కారణాలతో హాల్‌టికెట్లు, మార్కుల జాబితాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే సంబంధిత యాజమాన్యాల గుర్తింపును రద్దు చేస్తామన్నారు. ప్రభుత్వం నియమ, నిబంధనల మేరకు మాత్రమే ఫీజులు వసూలు చేయాలని ఆదేశించారు.

వసతి.. అధోగతి!

జిల్లాలోని వసతి గృహాలు అధోగతి పాలవుతున్నాయి. అసలే చలి కాలం.. భవన కిటికీలకు, మరుగుదొడ్లకు తలుపులు లేవు.. పడకేసిన పారిశుధ్యం.. అడుగడుగునా నిర్లక్ష్యం.. కానరాని నీటి సదుపాయం.. కుళాయిలకు లీకేజీ.. ఆరుబయటే చన్నీటి స్నానం.. నేలపైనే నిద్రించాల్సిన దుస్థితి.. ఇది జిల్లాలోని సాంఘిక, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లో కనిపిస్తున్న దయనీయ పరిస్థితులు. అరకొర సదుపాయాలతో వేలాది మంది పేద విద్యార్థులు వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులతో కాలం వెళ్లదీస్తున్నారు. వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాలని న్యాయస్థానాలు ఆదేశించినా కూటమి పాలకులు, అధికారుల్లో చలనం మాత్రం కరువైంది. సాక్షి బృందం పరిశీలనలో వెలుగులోకి వచ్చిన సమస్యలపై ప్రత్యేక కథనం.



నిండ్రలో శిథిలావస్థకు చేరిన బీసీ వసతి గృహం

- సమస్యలతో విద్యార్థుల సహవాసం
- పారిశుధ్యం అధ్వానం
- తలుపుల్లేని మరుగుదొడ్లతో అగచాట్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్ : పేద విద్యార్థులకు అండగా ఉండాల్సిన కూటమి ప్రభుత్వం అన్నింటా...చిన్నచూపు చూస్తోంది. జిల్లాలోని వసతి గృహాల్లో ఎక్కడ చూసినా సమస్యలు తాండవిస్తున్నాయి. సంక్షేమ వసతి గృహాల్లో వెలగని బల్బులు... తలుపుల్లేని కిటికీలే కనిపిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణకు నిధుల్లేక వార్డెన్లు చేతులెత్తేశారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్నారు. మెనూ సరిగ్గా అమలుకాకపోవడంతో నీళ్లచారు.. ముద్ద అన్నంతోనే విద్యార్థులు కడుపు నింపుకుంటున్నారు.

బినామీ ఉద్యోగులు

చిత్తూరు నగరం సంజయ్‌గాంధీనగర్‌లో ఉన్న ఎస్సీ ప్రీ-మెట్రిక్ వసతి గృహంలో బినామీ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఒక్క వసతి గృహంలోనే కాదు పలు సాంఘిక సంక్షేమ, బీసీ వసతి గృహాల్లో వంటమనిషి, కామాటిల కొరత ఉండడంతో వార్డెన్‌లు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకున్నారు. మరికొన్ని చోట్ల రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నా వారు హాస్టల్స్‌కు రాకుండా తమకు బదులుగా కొంత జీతం ఇచ్చి ప్రైవేట్ వ్యక్తులతో నడుపుతున్నారు. పది రోజులకు ఒకసారి వారు వచ్చి పర్యవేక్షించి వెళ్తుంటారు.

సొంత డబ్బుతో సరుకులు

జిల్లాలోని 30 శాతానికి పైగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో టెండర్ల సమయం ముగిసింది. అయితే కొత్తగా ఇంత వరకు టెండర్లను పిలవలేదు. టెండర్లకు రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆమోదం లభించలేదు. దీంతో టెండర్ దారులు వసతి గృహాలకు సరఫరా చేసే నిత్యావసర వస్తువులను నిలిపివేశారు. మరికొన్ని చోట్ల పెరిగిన ధరలకు అనుగుణంగా నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ఇస్తేనే సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. టెండర్లు నిలిచిన వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో వార్డెన్‌లు రోజుకు రూ.2 వేల వరకు ఖర్చు చేసి నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తున్నారు.

అలంకారంగా ఆర్వో ప్లాంట్లు

వసతి గృహాలకు దాతలు ఇచ్చిన ఆర్‌వో ప్లాంట్‌లు మరమ్మతులకు గురికావడంతో మూలనపడ్డాయి. విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్లు పంపిణీ చేయలేదు. మంచినీరు లేదు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ పెట్టెలు, వస్తువుల వద్దే నిద్రించాల్సిన దుస్థితి. ఆ పెట్టెలు కూడా విరిగిపోయి వంగిపోయాయి. వాటిలో దుస్తులు, పుస్తకాలు కానీ దాచుకోవాలంటే ఇబ్బందికరంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో చదువుకోవడానికి సరైన వసతుల్లేవు.

ఆరుబయటే..

వసతి గృహాల్లో సరైన మరుగుదొడ్లు, స్నానపుగదులు లేకపోవడం, కొన్ని చోట్ల ఉన్నా తలుపులు విరిగిపోవడం వంటి సమస్యలతో విద్యార్థులు ఆరుబయటే స్నానం చేస్తున్నారు. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెట్లు, పుట్ల వెంట పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళ బయటకు వెళితే విషపురుగుల బారిన పడతామేమోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.



చిత్తూరు సంజయ్‌గాంధీ నగర్‌లోని బీసీ హాస్టల్లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

సాక్షి పరిశీలనలో వెలుగుచూసిన అంశాలు

- చిత్తూరు నగరంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న ఎస్సీ ప్రీ మెట్రిక్ వసతి గృహంలో కుక్, కామాటి, వార్డెన్ లేరు. ఇన్‌చార్జి వార్డెన్‌తో హాస్టల్ నిర్వహిస్తున్నారు. వాచ్‌మెన్ బంధువులతో వంటలు వండిస్తున్నారు. ఇక్కడే ఉన్న బీసీ పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో కొన్ని నెలలుగా మరుగుదొడ్లకు తలుపులు లేవు. చెత్త కుప్పగా పేరుకుపోవడంతో దోమలు బెడద అధికంగా ఉంది.
- చిత్తూరు కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర పోస్ట్‌మెట్రిక్ వసతిగృహంలో 150 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే వసతిగృహ నిర్వహణకు నిధులను ప్రభుత్వం ఇవ్వడం లేదు. కుక్, కామాటి కూడా లేరు. వార్డెన్ బయటి వ్యక్తులను నియమించుకుని సొంత నిధులతో వంట చేయించి విద్యార్థులకు పెడుతున్నారు. కిటికీలకు మెష్‌లు లేకపోవడంతో రాత్రి పూట విద్యార్థులు చలి, దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- పుంగనూరు నియోజకవర్గం సదుం ఎస్సీ బాలుర వసతి గృహంలో 68 మంది విద్యార్థులున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షం పడితే ఉరుస్తోంది. బోరు మరమ్మతులకు గురైంది. తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. దాతలు ఇచ్చిన మినరల్ వాటర్ యంత్రం మూలన పడింది. చౌడేపల్లె హాస్టల్లో మరుగుదొడ్లు శుభ్రపరిచేవారు లేకపోవడంతో కంపుకొడుతున్నాయి. కుళాయిలు లేకపోవడంతో నీరువృథా అవుతోంది.



చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఉన్న ఎస్సీ హాస్టల్లో కిటికీల దుస్థితి

- కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం దండికుప్పం బీసీ వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. కుప్పంలోని బీసీ, ఎస్టీ వసతి గృహాల్లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని 49 కొత్తపల్లి మిట్ట ఎస్సీ బాలుర వసతి గృహంలో పై పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయి. మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఆరుబయటే స్నానం చేయాల్సి వస్తోంది. సురక్షితమైన తాగునీరు కూడా లేదు.
- పలమనేరు నియోజకవర్గంలోని హాస్టళ్లలో కనీస సౌర్యాలు లేవు. పారిశుధ్యం లోపించింది. అసలే వానాకాలం కావడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కొలమాసనపల్లి హాస్టల్‌కు దారి సమస్య ఉంది. వర్షం కారణంగా దారిమొత్తం చిత్తడిగా మారింది. హాస్టల్ వెనుకవైపు నిర్మాణ దశలో ఉన్న గృహాల వద్ద మందుబాబులు వీరవిహారం చేస్తుంటారు. హాస్టళ్లలో విద్యార్థులకు కప్పుకోవడానికి బెడ్‌షీట్లు ఇవ్వలేదు. పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో ఉన్న బీసీ హాస్టల్‌ను 36 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. గదుల్లో పైకప్పు పెచ్చులు ఊడిపడుతోంది. ఇక్కడ దోమల బెడద ఎక్కువగా ఉంది. దీని పక్కనే ఉన్న ఎస్సీ-1, ఎస్సీ-2 హాస్టళ్లలోనూ విద్యార్థులు అవే సమస్యలు ఎదుర్కొంటున్నారు.



పుంగనూరు నియోజకవర్గం సదుం ఎస్సీ బాలుర వసతి గృహంలో వర్షానికి ఉరుస్తున్న పైకప్పు

జిల్లాలో వసతి గృహాల వివరాలు

ఎస్సీ వసతి గృహాలు	57
ఎస్టీ వసతి గృహాలు	03
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	07
బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాలు	38
ట్రైబల్ గురుకులాలు	04
మహాత్మాగాంధీ పూలే గురుకులాలు	05
ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు	02

భద్రత కరువు

బాలికల వసతి గృహాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువైంది. వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయకపోవడంతో బాలికలు అభద్రతా భావంతో బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గతంలో పలు హాస్టళ్లలో రాత్రి వేళ్లల్లో ఆగంతకులు, ఆకతాయిలు, మందుబాబులు చొరబడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. బాలికల హాస్టళ్లలో పురుషులను సిబ్బందిగా, ట్యూటర్లుగా నియమించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ అమలు కావడం లేదు.



పలమనేరు బీసీ హాస్టల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న గదులు



కార్వేటినగరం మండలం 45 కొత్తపల్లి మిట్ట ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు స్నానం చేసే ఆరుబయట ప్రాంతం

ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు



గంగవరంలో ఎండిపోయిన పొలంలో రైతు సుబ్రమణ్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు సుబ్రమణ్యం గంగవరం మండలం కొత్తపల్లెవాసి. 4 నెలల ముందు వ్యవసాయ బోరుకు సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.19,000 చెల్లించాడు. అప్పటి నుంచి రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. అదిగో వచ్చేస్తుంది.. ఇదిగో వచ్చేస్తుంది అంటున్న అధికారుల మాటలపై ఆశలు పెట్టుకొని ఎదురు చూసి, చూసి పంట ఎండుముఖం పట్టింది. ఇక చేసేదేమీ లేక సమీప పొలం రైతు అనుమతితో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకున్నాడు. అది కూడా చాలక పోవడంతో ప్రస్తుతం వరి పైరు పూర్తిగా ఎండిపోయింది. ఇది ఒక రైతు పరిస్థితే కాదు జిల్లాలో వేలాది మంది రైతుల దీనస్థితి.

- 4 నెలలుగా ఒక సర్వీసు ఇస్తే ఒట్టు
- ఉమ్మడి జిల్లాలో 5 వేల సర్వీసులు పెండింగ్
- ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్ కోసం నిరీక్షణ
- స్టోర్స్‌లో కానరాని సామగ్రి
- పట్టించుకోని విద్యుత్‌శాఖ



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ ఎండిపోతున్న వరి పంట

చిత్తూరు కార్పొరేషన్: పంటకు ప్రాణం నీరు. అది పొలంలోకి రావాలంటే విద్యుత్ అవసరం. అన్నదాత వ్యవసాయం చేయడానికి విద్యుత్ సర్వీసుల కోసం పడిగాపులు కాస్తున్నాడు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడేది పంపుసెట్ల ద్వారా అందే నీరే. జిల్లాలో సాగవుతున్న వరి, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలనూ ఇలా పంపుసెట్ల కింద రైతులు విరివిగా సాగుచేస్తున్నారు. వీటన్నింటికీ విద్యుత్ సరఫరా కీలకమైనా వాటి మెటీరియల్స్ లేక ఉమ్మడి జిల్లాలో దాదాపు 5,000 వరకు రైతులు నరకయాతన పడుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో పాటు సాధారణ రోజుల్లోనూ పంటల సాగులో వ్యవసాయ మోటార్ల వినియోగం జిల్లాలో బాగా పెరిగింది. అంతటి ప్రాముఖ్యత ఉన్న వ్యవసాయ మోటార్లకు కావాల్సిన విద్యుత్ సర్వీసు కనెక్షన్లను వెంటనే మంజూరు చేయకుండా విద్యుత్‌శాఖ నెలల తరబడి పెండింగ్ పెడుతోంది. దీంతో రైతులకు పంటల సాగులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాదాపు 4 నెలలుగా విద్యుత్ శాఖ అధికారులు ఒక్క వ్యవసాయ విద్యుత్ సర్వీసును కూడా మంజూరు చేయకపోవడంతో కనెక్షన్ కోసం ఉమ్మడి జిల్లాలో దరఖాస్తు చేసుకున్న దాదాపు 5 వేల మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఇలా ఇస్తారు

సాధారణంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసు పొందాలంటే రైతులు సంబంధిత ఓల్టా, వీఆర్వో, బోర్‌వెల్ ధ్రువీకరణ పత్రాలతో మీ-సేవ కేంద్రాల్లో రూ.150 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకుంటారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ, డీఈఈ, ఈఈల స్థాయిలను బట్టి అనుమతులు వస్తాయి. వెంటనే సంబంధిత రైతులు ఒక హెచ్‌పీ (హార్స్ పవర్)కి రూ.1,200 చొప్పున ఎన్ని హెచ్‌పీలు కావాలనుకుంటే అన్ని రూ.1200తో పాటు రూ.40 సెక్యూరిటీ డిపాజిటల్ విద్యుత్ సంస్థకు చెల్లించాలి. సర్వీసులు మంజూరు చేసిన తర్వాత కావాల్సిన ప్రాంతం నుంచి విద్యుత్ లైన్ దూరాన్ని బట్టి మూడు స్తంభాలు, 180 మీటర్ల ఎల్‌టీలైన్, ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఉచితంగా ఆ శాఖ అందిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఇద్దరు, ముగ్గురు రైతులు ఒకే దగ్గర ఉంటే వారందరికీ కలిపి ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు. అయితే అదనపు స్తంభాలు, 180 మీటర్ల మించి ఎల్‌టీ లైన్ కావాలంటే నిబంధనల ప్రకారం రైతులు అదనంగా నగదును సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది.

మెటీరియల్స్ లేవంట

కనెక్షన్లు మంజూరు చేయక పోవడానికి ప్రధాన కారణం ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు (మెటీరియల్స్) అందుబాటులో లేకపోవడమేనని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ శాఖకు చెంది న స్టోర్స్ చిత్తూరులో ఉంది. టిక్కడి నుంచి ఉమ్మడి జిల్లాకు మెటీరియల్ సరఫరా అవుతుంది. అయితే ఈ స్టోర్‌లో మెటీరియల్ లేకపోవడంతోనే వ్యవసాయ సర్వీసులను నిలిపివేసినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన మెటీరియల్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేది. ప్రతి నెలా కోటా ప్రకారం ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులు సీనియారిటీ ప్రకారం జిల్లా రైతులకు వెంటనే కనెక్షన్లు ఇస్తుండేవారు. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. మెటీరియల్ లేకపోవడంతో ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితి. దీంతో తమకు ఎప్పుడు ఇస్తారో తెలియక వేలాది మంది అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

5 శాతం కూడా లేదు

ఉమ్మడి జిల్లాలో రైతులకు కావాల్సిన విద్యుత్ పరికరాలు స్టోర్స్ 5 శాతం స్టాక్ కూడా లేదు. ప్రస్తుతం దరఖాస్తుదారులకు 6వేల కిలోమీటర్లకు పైగా కండక్టర్ అవసరం ఉంది. అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు 5,000 వరకు అవసరం ఉన్నాయి. కానీ నిల్వ మాత్రం అందులో 250 కూడా లేవు. అయితే ఉన్న వాటిని రాజకీయ ఒత్తిళ్లతో అవసరమైన వారికి ఇండెంట్ పెట్టి అందజేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. సీనియారిటీ ప్రకారం కాకుండా సిఫార్సుల మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం గమనార్హం. ఇక పూర్తి స్థాయిలో మెటీరియల్స్ వచ్చి పని మొదలు పెట్టడానికి మరో రెండు నెలలు పట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

నెలలుగా తిరుగుతున్నాం



పంట పొలాలకు నీటి కోసం మోటార్ ఏర్పాటుకు విద్యుత్ కనెక్షన్ తీసుకొనేందుకు దరఖాస్తు చేశాను. ఇప్పటికి మూడు నెలలకుపైగా తిరిగినా కనెక్షన్ ఇవ్వలేదు. నాతోపాటు ఇలా ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు కార్యాలయానికి వెళ్లిన మెటీరియల్స్ లేదంటున్నారు అధికారులు. ఇంకా ఎన్ని రోజులు వేచిచూడాలో తెలియడం లేదు. **- పద్మనాభశెట్టి, కార్వేటినగరం**

నెలలో వస్తాయి

వ్యవసాయ సర్వీసులకు వాడే విద్యుత్ పరికరాలు (మెటీరియల్స్) నెలలో జిల్లాకు రానున్నాయి. తదనంతరం దశలవారీగా పరికరాలు వస్తుంటాయి. వాటిని సీనియారిటీ వారీగా రైతులకు అందించాలని అధికారులను ఆదేశించాం. మెటీరియల్స్ వచ్చిన వెంటనే అందజేయడానికి సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. **- సంతోషరావు, సీఎండీ, ఏపీఎస్పీడీసీఎల్**

బిల్లుల ద్వారా రూ.1.30 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లుల చెల్లింపుల కేంద్రాలను ఆదివారం వినియోగదారుల సౌలభ్యం కోసం అందుబాటులో ఉంచారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని బిల్లు వసూళ్ల కేంద్రాల ద్వారా 14,500 మంది వినియోగదారులు కరెంటు బిల్లులు చెల్లించారు. వీటి ద్వారా రూ.1.30 కోట్లు వసూలైనట్లు తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్‌అహ్మద్ పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా బిల్లులను చెల్లించి సంస్థకు సహకరించాలని అపరాధ రుసుంకు దూరంగా ఉండాలని సూచించారు. హెచ్‌టీ పరిశ్రమదారులు సకాలంలో బిల్లులు కట్టని పక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

రసాభాసగా డ్రైవర్ల సంఘం ఎన్నికలు



ఎన్నికల పరిశీలకుడిని ప్రశ్నిస్తున్న డ్రైవర్ కుమార్, పన్నీర్ సెల్వం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాల్సిన ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఎన్నికలను రసాభాసగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఎన్నికల కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు విచ్చేసిన ఆ సంఘం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఏకపక్షంగా ఒకే వర్గానికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఎన్నికలకు జిల్లా వైద్యఆరోగ్య శాఖలో డ్రైవర్‌గా పనిచేస్తున్న పన్నీర్‌సెల్వం (మాజీ జిల్లా అధ్యక్షులు), జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి చెందిన శ్రీనివాసన్ నామినేషన్‌లు దాఖలు చేశారు. పన్నీర్ సెల్వం దాఖలు చేసిన నామినేషన్‌లో తప్పులు ఉన్నాయనే కారణం చూపి ఎన్నికల పరిశీలకులు చిరంజీవి నామినేషన్‌ను తిరస్కరించారు. బైలాలో లేని నిబంధనలను సాకుగా చూపి నామినేషన్‌ను తిరస్కరించారని పన్నీర్ సెల్వం ఆరోపించారు. ముందస్తు స్కెచ్ ప్రకారం ఏకపక్షంగా మరొక వ్యక్తిని గెలిపించేందుకు ఎన్నికల పరిశీలకులు కుట్ర చేశారన్నారు. దీంతో ఏకపక్షంగా వ్యవహరించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకుల తీరును ఎండగడుతూ పన్నీర్ సెల్వం మద్దతుదారులు సంఘ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తనకు జరిగిన అన్యాయానికి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ఆయన వెల్లడించారు.వ్యవసాయ శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసన్‌ను రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులుగా ప్రకటించి నియామకపత్రం అందజేశారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ డ్రైవర్లు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



జిల్లా బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్ : బాస్కెట్‌బాల్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు కోచ్ బాబు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు 83 మంది క్రీడాకారులు హాజరుకాగా ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్టు డిసెంబర్ 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే 10వ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ జాను, అసోసియేషన్ సభ్యులు లక్ష్మీపతినాయుడు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

27న విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని డివిజన్ కార్యాలయ ఆవరణలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు డివిజన్ పరిధిలోని సమస్యలను తెలపాలని వివరించారు.

ఆలయ భూమి ఆక్రమణ


ఆలయ భూమిని ఆక్రమించుకుంటున్నారని నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని తొరిడి సమీపంలో ఉన్న చోళరాజుల కాలం నాటి శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ భూమిని గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకుంటున్నాడని గ్రామస్తులు నిరసన తెలిపారు. ఆలయానికి సుమారుగా 72 సెంట్ల భూమి ఉందని చెప్పారు. ఆలయ భూమిలో గ్రామస్తులు చందాలు వేసుకొని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. అయితే గ్రామానికి చెందిన వ్యక్తి శనివారం రాత్రి జేసీబీ, ట్రాక్టర్లతో ఆలయ భూమికి ఉన్న ఫెన్సింగ్‌ను కూల్చివేసి చదును చేశారని చెప్పారు. ఈ విషయంపై ఎండోమెంట్ అధికారుల దృష్టికి తీసుకెళతామని గ్రామస్తులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

పుంగనూరు: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ సమీపంలోని సుబ్బమ్మచెరువు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పద్మావతి(60) గుడివైపు నడిచివెళ్తు ఉండగా పట్టణానికి చెందిన ఇద్దరు బాలురు అతివేగంగా ద్విచక్ర వాహనంపై పలమనేరు వైపు వెళుతూ పద్మావతిని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తిరుపతి జీవకోనలోని విశ్వం విద్యాసంస్థలో నిర్వహించిన సాక్షి మ్యాథ్స్‌బీ పోటీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు


స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సాక్షి మ్యాథ్స్‌బీ.. స్పెల్‌బీకి విశేష స్పందన

- నాలుగు కేటగిరీల్లో రౌండ్–2 పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి వేదికగా మ్యాథ్స్‌బీ సెమీ ఫైనల్, స్పెల్‌బీ రౌండ్–2 పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇదివరకు పాఠశాల స్థాయిలో నిర్వహించిన మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రౌండ్–2 పరీక్షలను జీవకోనలోని విశ్వం విద్యాసంస్థలో చేపట్టారు. తిరుపతి, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యాజమాన్యంతో కలిసి పరీక్షలకు ఉత్సాహంగా హాజరయ్యారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేందుకు గణితం, ఆంగ్లం ఈ రెండింటిపై పట్టు తప్పనిసరి. గణితంలో ఫార్ములాలు, ఆంగ్ల భాషలో నైపుణ్యం ఉంటే ఉన్నతంగా రాణించడం సాధ్యం. వీటి ప్రాధాన్యతను గుర్తించిన సాక్షి మీడియా గ్రూప్ గణితం, ఆంగ్ల భాషపై విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించి ఆ రెండు సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించేలా వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏటా మ్యాథ్స్ బీ, స్పెల్‌బీ నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి (రౌండ్–1), క్వార్టర్ ఫైనల్(రౌండ్–2), సెమీ ఫైనల్ (రౌండ్–3), ఫైనల్స్ (రౌండ్–4) విభాగాల్లో పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు నగదు, ఇతర ప్రోత్సాహక బహుమతులను అందిస్తోంది. ఈ ఏడాది ఈ రెండు పరీక్షలకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వేఫి, అసోసియేషన్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి వ్యవహరిస్తోంది.

మ్యాథ్స్‌బీ ..

మ్యాథ్స్‌బీ సెమీ ఫైనల్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఉదయం 10నుంచి 11గంటల వరకు నాలుగు కేటగిరీలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై తమ మేధస్సుకు పదును పట్టారు.

స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్...

ఇదివరకు పాఠశాల స్థాయిలో నిర్వహించిన స్పెల్ బీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రౌండ్–2 పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకుకు నాలుగు కేటగిరీలో ఈ పరీక్ష జరిగింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. స్పెల్‌బీ పరీక్ష రాయడానికి విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. ఇంగ్లిష్ భాషపై తమకున్న పట్టు, ప్రతిభను పరీక్షించుకున్నారు. స్పెల్‌బీ ద్వారా తమలో నైపుణ్యం, సామర్థ్యం పెరిగిందని, భాషపై పట్టు సాధించామని, కొత్త పదాలు, స్పెల్లింగులు, పదాల ఉచ్చారణ వంటి కొత్త విషయాలు తెలుసుకుంటున్నామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులను మరింత నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు సాక్షి ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కొనియాడారు.

సులువుగా గణితం



సాక్షి మీడియా గ్రూప్ అందించిన మ్యాథ్ బీ మెటీరియల్‌ను రోజూ సాధన చేయడంతో గణితం చాలా సులువుగా అనిపించింది. ఈ మెటీరియల్‌లోని ఫార్ములాలు, వాటిని ఎలా పరిష్కరించాలో సులభతరంగా ఉన్నాయి. గణితం అంటే ఇప్పుడు నాకు చాలా ఈజీ సబ్జెక్టుగా మారింది. థ్యాంక్స్ టూ సాక్షి.

– సి.లేఖ్య, 7వ తరగతి, ఎడిఫై స్కూల్, తిరుపతి

కొత్త పదాలను తెలుసుకున్నా



స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం ఇదో మూడో సారి. అయినా ప్రతి ఏటా ఇంగ్లిష్ భాషలోని కొత్త పదాలను తెలుసుకుంటున్నా. వాటి స్పెల్లింగ్ నేర్చుకుంటున్నా. ఎలా ఉచ్చరించాలని మా టీచర్లు నేర్పించారు. స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్ పరీక్షను బాగా రాశా.

– పి.జాయ్‌లిన్ మెర్సీ, 10వ తరగతి, క్యాంఫోర్డ్(ఈస్ట్) స్కూల్, చిత్తూరు

మ్యాథ్స్‌పై పట్టు



మ్యాథ్స్ సబ్జెక్టు అంటే నాకు ఇష్టం. అయితే అందులో కొన్ని నాకు అర్థం అయ్యేవి కాదు. మ్యాథ్స్‌బీ పరీక్షలో మొదటి సారి పాల్గొంటున్నా. మ్యాథ్స్‌బీ మెటీరియల్ ద్వారా చాలా నేర్చుకున్నా. తెలియని వాటిని టీచర్లను అడిగి తెలుసుకున్నా. మ్యాథ్స్‌బీ మెటీరియల్ ద్వారా గణితంపై మరింత పట్టు సాధించా.

– ప్రేమ్‌లోహిత, 5వ తరగతి, విశ్వం స్కూల్, తిరుపతి

ఆసక్తి మరింత పెరిగింది



స్పెల్‌బీ పరీక్షలో తొలిసారిగా పాల్గొన్నా. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరచి క్వార్టర్ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడంతోపాటు మరింతగా నైపుణ్యం సాధించాలనే ఆసక్తి కలిగింది. థ్యాంక్స్ టూ సాక్షి.

– కె.సారాజేన్, 7వ తరగతి, క్యాంఫోర్డ్(వెస్ట్) స్కూల్, చిత్తూరు

ఉచ్చారణ తెలిసింది



స్పెల్‌బీ పరీక్షలో తొలిసారిగా పాల్గొన్నా. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరచి క్వార్టర్ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. పాఠశాల్లోని ఇంగ్లిష్ పదాలతో పాటు ఇతర కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్, ఉచ్చారణ తెలిసింది. ఇంగ్లిష్ భాషపై పట్టుతో పాటు మరింతగా నైపుణ్యం సాధించేందుకు స్పెల్‌బీ నాకు బాగా ఉపయోగపడింది.

– పి.జోషితారెడ్డి, 5వ తరగతి, విశ్వం విద్యాసంస్థ, తిరుపతి

పోటీ ప్రపంచంలో రాణించేందుకు..



ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు సబ్జెక్టు పరంగానే కాకుండా అన్ని అంశాల్లో నైపుణ్యం కలిగి ఉండాలి. కొంత మంది విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్ అంటే కొంత భయం ఉంటుంది. సరైన విధానంలో వారికి బోధించకుంటే ఈ భయం మరింత పెరుగుతుంది. వారిలో ఆసక్తి పెంపొందించి రాణించేందుకు సాక్షి నిర్వహిస్తున్న మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీ దోహదపడుతుంది. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు మరిన్ని కార్యక్రమాలు సాక్షి చేపట్టాలని కోరుకుంటున్నా.

– ఎన్.విశ్వచందన్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్, విశ్వం విద్యాసంస్థ, తిరుపతి

ఫైనల్స్‌కు వెళ్లడమే లక్ష్యం



స్పెల్‌బీ పరీక్షలో మొదటి సారి పాల్గొంటున్నా. స్పెల్ బీ మెటీరియల్‌లో చాలా కొత్త పదాలున్నాయి. వాటిని ఎలా ఉచ్చరించాలి, స్పెల్లింగ్స్ తెలుసుకున్నా. ఇంగ్లిష్ భాషపై మంచి పట్టు సాధించడానికి స్పెల్‌బీ ఎంతో దోహదపడుతోంది. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచి రౌండ్–3, రౌండ్–4లో ప్రతిభ కనబరచి ఫైనల్స్ చేరడమే లక్ష్యం.

– మూడే సంహిత, పి.దీక్షారెడ్డి, 8వ తరగతి, ఎడిఫై స్కూల్, తిరుపతి



సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Wanted

KCS (Security & Manpower) సంస్థ కొరకు తిరుపతి చుట్టుపక్కల పనిచేయుటకు ఫీల్డ్ ఆఫీసర్,PRO కావలెను.జీ: 20-35వేలు (Depends on Experience). # +917981504336.

ప్రభుత్వ పాఠశాలల్లో Outsourcing పద్ధతిలో పనిచేయుటకు ఒకేషనల్ టీచర్లు, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. అన్ని రకాల కాంట్రాక్ట్ ఉద్యోగాలకు సంప్రదించు: 9848771117, 9949942245.

CC TV, సెక్యూరిటీ అలారమ్, Fire అలారమ్ సిస్టమ్స్‌గల ప్రముఖ కంపెనీకి ఫీల్డ్ సర్వీస్ టెక్నీషియన్స్ కావలెను. Qul: ITI / అనుభవం, జీతం: 12 to 20K PM. ✆ 93987 28839, 63007 40378.

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోమ్ అవకాశం కలదు. 8121618692

కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ:15- 40 వేలు. ఫ్రీ రూం+ భోజనం. HYD. 9182280297

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, చంటి పిల్లలను, చూసుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి, ఫుడ్, జీ : 18K. Ph: 8520980099, 8520874499

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

వరి పంటపై అడవి పందుల దాడి



ఐరాల: మండలంలో వరి సాగు చేసిన రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. పంట కోత దశకు చేరుకోవడంతో అడవి పందులు బీభత్సం సృష్టిస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి అటవీ ప్రాంతానికి సరిహద్దు గ్రామమైన 35 యర్లంపల్లెకు చెందిన రైతు కేశవులు వరి పంటను తొక్కి, తిని నాశనం చేశాయి. సుమారు రూ.20 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. ఇటీవల నాగంవాండ్లపల్లెలో వరి పొలాలపై అడవి పందులు దాడి చేశాయి. నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని బాధిత రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: గుడిపాల మండలంలో ఆదివారం చిత్తూరు అర్బన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుడిపాల మండలం చీలావల్లి క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళ పట్టుబడింది. అధికారులు ఆమె వద్ద 20 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పృథ్వీరాజ్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శరవణ, దామోదర, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ

యాదమరి(పూతలపట్టు): ఆలయంలో హుండీని దొంగిలించిన ఘటన మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు మోర్ధానపల్లిలోని గంగమ్మగుడిలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీని దొంగిలించి గ్రామానికి పక్కనున్న చెరువు కట్టపైకి వెళ్లారు. అక్కడ హుండీని పగలగొట్టి అందులోని డబ్బులు తీసుకొని హుండీని అక్కడే పడేసి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం గుడివద్దకు వెళ్లిన పూజారి చోరీ జరిగిందని గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. అందరూ కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు.

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు


నిందితుడు సర్దార్


మృతుడు నవాజ్ (ఫైల్)


పొదల మధ్య నవాజ్ మృతదేహం

వి.కోట : మూడు రోజుల క్రితం అదృశ్యమైన యువకుడు పాలారు నదిలో శవమై తేలిన సంఘటన ఆదివారం మండలంలో వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు, పోలీసులు కథనం మేరకు, కొంగాటం పంచాయతీ చింతల ఎల్లాగరం గ్రామానికి చెందిన సుభాన్ కుమారుడు నవాజ్ అలియాస్ అల్లు (27) డ్రైవర్. అదే గ్రామానికి చెందిన సర్దార్‌తో నవాజ్ కలసి చేపలు పట్టడానికి పాలారు నదికి వెళ్లేవాడు. ఈ క్రమంలోనే గురువారం నవాజ్ సర్దార్‌తో కలసి చేపలు పట్టడానికి వెళ్లాడు. సాయంత్రం నవాజ్ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. గ్రామస్తులు సర్దార్‌ను ప్రశ్నించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. నవాజ్ కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్దార్ కుటుంబ సభ్యులను పోలీసులు విచారించగా విషయం బయటపడింది. సర్దారే నవాజ్‌ను హతమార్చి నదిలో పడేసి ఉంటారని నిందితుడి కుటుంబ సభ్యుల అనుమానం మేరకు గ్రామస్తులు నదిలో వెతికారు. ఎట్టకేలకు నవాజ్ మృతదేహం పొదల మధ్య బయటపడింది. ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణమని ఇరు కుటుంబాల వారు చెబుతున్నారు. డ్రిప్ పైపులతో కొట్టి హతమార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, సర్దార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. మృతునికి భార్య షాహీన, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ


మొరం గ్రామం వద్ద ఆయిల్ తీసేసిన ట్రాన్స్‌ఫార్మర్

పలమనేరు: రైతుల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి కమ్మీని చోరీ చేసే దొంగలను పోలీసులు ఎప్పటికప్పుడు అరెస్టులు చేయడంతో ఈ చోరీలు తగ్గుముఖం పట్టాయి. దీనిపై అధ్యయనం చేసిన ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి కమ్మీకి బదులు, అల్యూమినియం కమ్మీని పెట్టసాగారు. దీంతో వీటిని చోరీచేసినా దొంగలకు పెద్దగా గిట్టుబాటు కాకుండా పోయింది. అయితే ఇప్పుడు ట్రెండు మార్చిన దొంగలు గ్రామాల్లో త్రీఫ్యాజ్ కరెంట్ షిప్టుల వారీగా సరఫరా చేస్తున్నారు. కరెంట్ లేని సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న ఓ నెట్‌ను విప్పి ఆ రంధ్రంలో చిన్నపాటి రబ్బరుపైపుద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌ను లాగేస్తున్నారు. ఇది గిట్టుబాటవుతుండడంతో దొంగలు ఇప్పుడు ఇలాంటి చోరీలకు దిగుతున్నారు. తాజాగా పలమనేరు మండలం మొరం గ్రామం వద్ద హైవే పక్కనున్న రైతులు చంద్రారెడ్డి, చెన్నప్పకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లలో చుక్క ఆయిల్ లేకుండా చోరీచేశారు. ఈ విషయం తెలియని రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు రిపేరు అయ్యాయని తీసుకెళితే అందులోని ఆయిల్‌ను తస్కరించిన విషయం బయటపడింది. ఇలాంటి చోరీల నివారణకు ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ సహదేవి

పెద్దపంజాణి: కర్ణాటక మద్యం తరలిస్తున్న మండలంలోని కరసనపల్లెకు చెందిన రామయ్య కుమారుడు వి. శివరాజును శ్రీరామపురం క్రాస్ వద్ద ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సహదేవి తెలిపారు. అతని వద్ద నుంచి 17 కర్ణాటక మద్యం (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు, ఒక లీటరు నాటు సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్‌ఐ చెప్పారు. ఇతనిపై ఇప్పటికే స్థానిక పోలీసు స్టేషన్‌లో 5, పుంగనూరు ఎక్సైజ్ స్టేషన్‌లో 3 కేసులు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. ఆలయంలో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

చౌడేపల్లె: స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణలో ఆదివారం వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ఈషా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల నుంచి 25 బృందాలు ఈ పోటీలో తలపడ్డాయి. ఇందులో పెద్దపంజాణి మండలం ముత్తుకూరు జట్టు ప్రథమ స్థానం, చీనేపల్లె జట్టు ద్వితీయస్థానం, బైరెడ్డిపల్లె జట్టు తృతీయ స్థానం, మఠ్రిమాకులపల్లె జట్టు నాలుగో స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం నాగరాజరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు


విజేతగా నిలిచిన గుంటూరు జిల్లా బాలికల జట్టు

- బాలుర పోటీల్లో విజేత కడప జట్టు
- బాలికల పోటీల్లో గుంటూరు జట్టు విజయం

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలుర హైస్కూల్, అరగొండ టోటల్ హెల్త్ క్రీడామైదానంలో ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు హోరాహోరీగా సాగిన 68వ అంతర్ జిల్లాల అండర్–14 సాఫ్ట్‌బాల్ బాలబాలికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్స్‌లో హోరాహోరీగా తలపడి తమ సత్తాచాటిన జట్లు ట్రోఫీలు అందుకున్నాయి.

బాలుర పోటీల్లో విజేతలు

- విజయనగరం జిల్లా బాలుర జట్టుపై కడప జట్టు విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో విజయనగం జిల్లా జట్టు నిలిచింది.
- గుంటూరు జట్టుపై చిత్తూరు జట్టు గెలిచి మూడవ స్థానం కైవసం చేసుకుంది.

బాలికల పోటీల్లో విజేతలు

- విజయనగరం జిల్లా బాలికల జట్టుపై గుంటూరు జట్టు గెలిచి టోర్నమెంట్ ట్రోఫీని దక్కించుకుంది. విజయనగరం జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది.
- కడప జిల్లా జట్టుపై తూర్పు గోదావరి జిల్లా జట్టు గెలిచి తృతీయ స్థానం దక్కించుకుంది.

విజేతలకు ట్రోఫీల ప్రదానం

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ పరిశీలకులు జగదీశ్వరయ్య, ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంతవాణి, టోర్నమెంట్ ఆర్గనైజర్ కృష్ణ చేతులు మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు బంగారు, వెండి, కాంస్య ట్రోఫీ కప్‌లను, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. 13 జిల్లాల నుంచి విచ్చేసిన 160 మంది బాలురు, 160 మంది బాలికల క్రీడాకారులకు ప్రగతి పత్రాలను జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి వసంతవాణి అందజేశారు.